# మాతృదర్శనమ్

మునిపల్లె రాజు

"తత్ దినమ్ అంటే ఆ రోజు, స్మృతించవలసిన ఆ దినము. తద్దినం అని మనం అనాలోచితంగా అంటాం.

ఆబ్దీకమ్-అంటే అబ్దానికి అనగా సంవత్సరం సంవత్సరం ఆచరించవలసినది.

శ్రాద్ధమ్-అనగా శ్రద్ధతో నిర్వహించవలసినది.

"మానవుల కాలమానంలో సంవత్సరం-పితృదేవతలకు ఒక రోజు కింద లెక్క. అనగా, మనం ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్న శ్రాద్ధకర్మ ద్వారా మన పితృదేవతలు ప్రతి దినమూ భుజిస్తున్నారన్న మాట. ఒక్క ఆబ్దీకం మానితే పితృదేవతలకు ఆ దినం ఉపవాసమే నన్న మాట."

గరుడపురాణంలోని ఇంకొన్ని అంశాలను, స్వల్ప కన్నడ యాసతో తెలుగులో వివరించి చెబుతున్నాడు ఆ వృద్ధ బ్రాహ్మడు. రాఘవేంద్రస్వామి మఠం మేడ మెట్లమీద, ధోవతి సరిగా మడుచుకోవటం రాని ఒక యువకుడు ఆ మాటలు వింటున్నాడు.

ఉదయం తొమ్మిది గంటలయింది. హైదరాబాదులోని బర్కత్‌పురా అంచున ఉన్న రాఘవేంద్రస్వామి మఠం ధనుర్మాసంలో అయితే తెల్లవారుజామునుంచీ భక్తబృందంతో క్రిక్కిరిసి ఉండేది. ఇప్పుడు ధనుర్మాసం గడిచిపోయింది. స్వామివారి బృందావనం ముందు కొద్దిమంది భక్తులు తీర్థం తీసుకొంటున్నారు. కాని మఠం పై అంతస్తు శ్రాద్ధకర్మలు నిర్వర్తించటానికి వేచి ఉన్న పాతిక, ముప్ఫయిమంది శిష్టాచారులతో నిండుగా ఉంది.

అట్లా వేచి ఉన్నవారిలో చాలామంది ఉద్యోగస్థులు. కొందరు పెన్షన్‌దారులు. గరుడపురాణం గాని, మార్కండేయ పురాణం గాని వారికి పట్టినట్లులేదు. ఆఫీసుల మీది ధ్యాసతో చేతి గడియారాలు చూసుకొంటూ, ఉబుసుపోకకు రాజకీయాలు, లోకాభిరామాయణాలు మాట్లాడుకొంటూ ఎవరి ఆధిక్యాన్ని వారు చాటుకుంటూ, ఇతరులను ఖండిస్తే గాని తమకు తృప్తి లేదనుకొనేవారే అధిక సంఖ్యలో ఉన్నట్లున్నారు. వ్యక్తిగత అభిప్రాయాలు అందరిమీదా రుద్దితే గాని వాళ్ళ పితరుల ఆత్మలు శాంతించవు కాబోలు-అని ఒక రిద్దరు జిజ్ఞాసువులు ఆంతరంగికంగా తలపోస్తున్నారు.

సుశీల రెండుసార్లు మెట్లు దిగింది. రెండుసార్లు ఎక్కింది. మేడమీది మూడు హాళ్ళను పరికించి వచ్చింది. అపరకర్మలు నడిపించే మఠం తాలూకు బ్రహ్మవేత్త కూడా పెద్ద దర్భల చుట్ట పట్టుకొని పైకి వచ్చి, అక్కడి ఏర్పాట్లన్నీ ఒకసారి పరికించి చూసి, వంట బ్రాహ్మడితో కన్నడంలో మాట్లాడుతూ-"ఇదుగో అయిదు నిమిషాల్లో ప్రారంభిద్దాం. యజుర్వేదులంతా అటు కూచోండి. ఋగ్వేదులు ఇక్కడ" అని శ్రాద్ధకర్తలకు స్థలాలు నిర్దేశించాడు. నీళ్ళ చెంబు, హరివేణం, ఉద్ధరణి, చిన్న గిన్నెలో నువ్వులు, మరో చిన్న గిన్నెలో బియ్యపు గింజలూ, అన్నపు గిన్నె పాయసపు పాత్ర, కణకణలాడుతున్న బొగ్గులతో ఒక్కొక్క కుంపటి, వాటితో పాటు ఆకు దొప్పలు. ఒక్కొక్కరి ముందు ఇవన్నీ ఉన్నాయి గాని, మరిచిపోయిన తులసిదళాలు, గంధం ఆకు, బెల్లంముక్క, పెరుగు గిన్నె నేతి దొన్నెలు తెచ్చి వంట బ్రాహ్మడు సర్దుతుంటే సుశీలకు మరింత ఆత్రత కమ్ముకొన్నది.

ఆ రోజు ఆమె తల్లి ఆబ్దీకం. కర్తగా కుదుర్చుకొన్న బ్రాహ్మ డింకా రాలేదు. సామూహిక శ్రాద్ధ కాండ ప్రారంభించబోతున్నారు.

కళ్ళలో, మాటల్లో ఆందోళన వ్యక్తమవుతూండగా ఆమె మంత్రోచ్చారణకు నోరు విప్పబోతున్న బ్రాహ్మణ్ణి సమీపించి-"ఏమండీ..." అంది.

రాజకన్యలా ఉన్న ఆమె ఠీవినీ, అందాన్నీ కొట్టవస్తున్నట్లున్న ఆమె ఐశ్వర్యమూర్తినీ ఎవరు గౌరవించకుండా ఉండగలరు?

"ఫరవాలేదమ్మా. కింద ఆఫీసుకు పోయి చూడండి. బీదబ్రాహ్మ లెవరైనా దొరుకుతారు."

సుశీల గబగబా మెట్లు దిగిపోతున్నది. రెండు చేతుల నిండా బంగారు గాజులు, కళ్ళకు రోల్డుగోల్డు ఫ్రేము అద్దాలు, బంగారు రంగు బెంగుళూరు పట్టుచీర, చేతిలో ధోవతుల జత ఉన్న పాకెట్టు, భుజాల నిండుగా కప్పుకొన్న మీగడతెలుపు కాశ్మీరు శాలువా. అందర్నీ-అంటే సామాన్యు లందర్నీ-కిటికీ దగ్గరకు వచ్చి మాట్లాడమనే మఠం మేనేజరులు కూడా ఆమె చొరబడి లోనికి వస్తుంటే లేచి నుంచొని మర్యాదగా సానుభూతిగా మాట్లాడుతున్నా అక్కడ మనిషెవరూ కనిపించక మళ్ళీ ఆవేదనతో మెట్లముందుకు సాగింది.

అప్పుడు కనబడ్డా డా యువకుడు. సన్నగా, దృఢంగా, పాత ధోవతి, నలిగిన లాల్చీ, పైన టవలు, రెండు రోజుల గడ్డం, ఆకలిగా ఉన్నట్లు లోతుకుపోయిన కళ్ళు, చామనచాయ దేహ వర్ణం-ఇదీ అతని ఆకారం. మఠంలో మధ్యాహ్నం భోజనం టిక్కెట్టుకు ఇట్లాంటి వాళ్ళు ప్రతి రోజూ ఒక రిద్దరైనా తగులుతుంటారు. ముఖ్యంగా పేదకన్నడ బ్రాహ్మలు. సుశీల అతన్ని నిలవేసింది.



"ఏమండీ... మీరు...మీరు బ్రాహ్మలేగా?"

అతను ఆమెను పూర్తిగా చూడకుండానే తల ఊపాడు.

"చూడండి. ఈ రోజు మా అమ్మగారి శ్రాద్ధకర్మ ఉంది. నాకు...అన్నదమ్ము లెవరూ లేరు. కుదుర్చుకొన్న బ్రాహ్మడు ఇంతవరకూ అయిపులేడు. భోక్త లున్నారు పైన. మీరు కూర్చుంటారా-ఇబ్బంది లేకపోతే? పాతిక రూపాయ లిస్తాను దక్షిణ. ఇదుగో ధోవతుల జత, ఉత్తరీయాలు. మీకు పుణ్య ముంటుంది. మా అమ్మ తద్దినం ఎప్పుడూ మానలేదు."

అంతా విన్నాడో లేదో అతను- "పదండి" అని మాత్రం ముందడుగేశాడు. మొదటిసారిగా ఆమె ముఖం పరికించినట్లుంది. "నా కేమీ అక్కర్లేదు. మాతృయజ్ఞం చాలా పవిత్రమైనది" అన్నాడు.

నాలుగైదు నిమిషాల్లో అతను చన్నీళ్ళ స్నానం ముగించి, గుడ్డలు పిండుకుంటూ హాల్లోకి వచ్చాడు. ఆమె అతనికి చోటు చూపిస్తూ "కృష్ణయజుర్వేదులం. ఈ చీటీమీద మా గోత్రపురుషుల ప్రవర, మా అమ్మగారి పేరు, మా నాయనమ్మల పేర్లు ఉన్నాయి. శ్రమ అనుకోకుండా శ్రద్ధగా..." అని చీటీ అందించింది.

అతను చీటీ ఒకసారి చూసుకున్నాడు. భారద్వాజస గోత్రం. మొదటి పేరు 'శారదాంబ'. ఉలిక్కిపడి ఆమె వంక చూసి తలవంకించాడు. అతని తల్లి పేరు కూడా శారదాంబే.

సుశీల అనిర్వచనీయమైన తృప్తితో అతని వంక మరోమారు చూసింది. తడి టవలు మొలకు గట్టిగా చుట్టుకొన్నాడు. మెడలో మూడు పోగుల జందెం, నిమీలిత నేత్రాలతో గాయత్రిని జపిస్తూ, ఏదో కూలికి కాకుండా తన తల్లి శ్రాద్ధకర్మనే నిర్వర్తిస్తున్నట్లుగా దీక్షపూనిన యువపరివ్రాజకుడిలా గోచరిస్తున్నాడు.

పరివ్రాజకుడు-అన్న శబ్దం హృదయక్షేత్రంలో ప్రతిధ్వనించి సుశీల ఉలిక్కిపడ్డది. వెన్నుపూసమీద హిమవర్షం కురిసినట్లయింది. "ఏమయిందమ్మా? ఏమయింది?" అని ఆమె పక్కనే నిలబడి ఉన్న ఇద్దరు ముత్తయిదువులు ప్రశ్నిస్తున్నారు.

"ఏం లేదండీ. మా నాన్న అమ్మా జ్ఞాపకం వచ్చారు" అని గోడకానుకుని నిలబడింది.

దాదాపు అతని వయసులోనే తన తండ్రి

సన్యాసాశ్రమం స్వీకరించాడు. ఎవరి అనుమతీ తీసుకోలేదు. ఎవరినీ సంప్రదించలేదు. 'శాంతమూర్తి'-అని అమ్మ ఒకే ఒక మాటలో అయన్ని గురించి ప్రస్తావించేది. తన మేడ, ఐశ్వర్యం, అనుకూలవతి అయిన భార్య, రెండు నెలల పసికందయిన తాను-ఇవన్నీ విడిచి ఆ ముష్మికలోకాల్ని వెతుకుతూ, అంత అకస్మాతుగా ఏ దిక్కున పయినించాడో ఈనాటికీ అగమ్యమే.

ఒక్కసారి మాత్రం తల్లితో ఒకే ఒక్క వాక్యంతో తన మనోవేదన చెప్పుకొన్నాడట: "ఈ జీవితం అబద్ధమైనది" అని. అమ్మ ఏమని ఏడ్చిందో, ఏ దేవతల్ని ప్రార్థించిందో తన కెట్లా తెలుస్తుంది? మొనలికన్నీరు కారుస్తూనే ఆస్తికోసం వింత వింత ఉచ్చులు పన్నిన బంధువుల నుంచి, జ్ఞాతివైషమ్యాల నుంచి-స్వీయరక్షణ చేసుకొంటూ, తనను కంటిరెప్పగా సాకిన తల్లి మాత్రమే తనకు గుర్తు. ఎవరు రూపమో, ఎవరు నీడో తెలీకుండా పెంచిన సౌజన్య స్వరూప మొక్కటే తన ఆరాధ్యదేవి అయింది. ఆ కారుణ్యమూర్తి కోర్కెతోనే పెద్ద చదువులు చదివిందీ, ఆడిందీ, పాడిందీ.

మూడేళ్ళ క్రితం అనాయాసంగా తన అసిధారావ్రతాన్ని ముగించి తనువు చాలించింది. ఒక్కటే కోరిక: "తల్లీ-మంచివాణ్ణి చూసి పెళ్ళాడు" తుది కోరిక. ఎవ రా మంచివాడు? తన ఆస్తిని చూసి భ్రమించేవాడా? అంతస్తుకు విభ్రమం పొందేవాడా? తన తల్లిని గౌరవించేవాడే తనకు మంచివాడు. తులసికోట లాంటి తల్లి ప్రశాంతతే తన అవ్యక్తావేదన. ఎవరితో ముచ్చటించినా తీరని ఆ ఆవేదనకు అక్షరరూపమే-ఆమె ఈ నాలుగేళ్ళ నుంచీ రాస్తున్న 'మాతృ స్మృతి'. పద్యాలూ, పాటలూ-సాంప్రదాయబద్ధమైనవీ, పాశ్చాత్యరీతులవీ. విశ్వవిద్యాలయంలో తను చదువుతూన్నప్పుడు ఆకళించుకొన్న ప్రాక్పశ్చిక ప్రాకారాల మధ్య ఉన్న స్మృతుల రవళి. ఎవరికీ చూపలేదు; ప్రశంసల ప్రస్తావనే లేకుండా తన ఆత్మతృప్తికీ, వేదనోపశమనానికీ వేలు వెచ్చించి అచ్చు వేయించింది. వానిటీ బ్యాగు నుంచి తీసి చదువుకుంటున్నది.

కింద స్వామి బృందావనం నుంచి హస్తోదకం గంట వినవచ్చి సుశీల పుస్తకం మూసింది. అక్కడ శ్రాద్ధకర్మకాండ కూడా ముగిసినట్లుంది.

"ఆ వాయన పిండాన్ని దొన్నెలో వేసుకుని పైకి వెళ్ళి కాకులకు పెట్టండి"-అని వశిష్ఠులవారు నిర్దేశిస్తున్నారు.

అతను దొన్నె రెండు అరచేతుల మధ్య ఉంచుకొని డాబామీదికి నడుస్తున్నాడు. తను కూడా అతని వెనకనే వెళ్ళింది. పిట్టగోడ అంచున దొన్నెను ఉంచి, కళ్ళు మూసుకొని నమస్కరిస్తున్నాడో లేదో, కాకి వచ్చి పిండాన్ని అమాంతం నోట కరచుకుంది. ఆమె కళ్ళు చెమ్మగిల్లి వందనం చేస్తూ రెండు క్షణాలు నిలబడిపోయింది. వాయన రూపంలో వచ్చిన పితృ మాతృదేవతలు తృప్తిపడ్డారు గదా ! ఎప్పుడూ, ఈ మూడు, నాలుగేళ్ళ నుంచి తన కంత ఆనందం కలగలేదు.

అతను మళ్ళీ మెట్లు దిగి తడిపొడిగా ఉన్న ధోవతిమీదనే, గోడవారన ఉంచిన చొక్కా తొడుక్కొని తువాలును ఒకసారి నిశ్శబ్దంగా దులుపుకొని, ఆమెకోసం కాబోలు కలయజూస్తున్నాడు. సుశీల అతని ఎదుటనే ఉన్నది.

"అదేమిటి? భోజనం చేయరా?" అని విస్తుపోయి అడిగింది.

శ్రాద్ధకర్మల వారికి మఠం వారు మూడు భోజనం టిక్కెట్లు కూడా ఇస్తారు. మిగతా వారు అన్న పాయసశేషాన్ని ప్రసాదంగా భావించి గాని, యజ్ఞశేష మనుకొని గాని భోజనశాలకు తమతో తీసుకుపోతారు.

"లేదండీ. నేను వెళ్ళాలి. భోక్త లింకా ఉన్నారు కదా !"

సుశీల గబగబా పర్సు తీసి చూసింది. పది రూపాయల నోటు ఒక్కటే ఉంది. మిగతావి ఏభైలు, వంద నోట్లు. ధోవతుల పాకెట్టు విప్పి, ఒక ఏభై నోటు ఉత్తరీయాల జతమీద పెట్టి-"చాలా థాంక్సండీ. సమయానికి మీరు కనిపించకపోతే చాలా ఇబ్బం దయేది" అంటూ ఇవ్వబోయింది.

"నా కేమీ అక్కర్లేదన్నాను ఇందాక. మళ్ళీ అదే మాట. మీ తృప్తికి శాస్త్రార్థం రూపాయి పావలా దక్షిణ ఇస్తే చాలు."

"మరి ఇవి...?" అవి ధోవతులు.

"ఇక్కడ బ్రాహ్మల కెవరికైనా ఇవ్వండి. బయట పేదవాళ్ళు బారులుతీర్చి కనపడతారు. వాళ్ళకు దానం చేయండి. మంచిది కూడా."

పర్సంతా వెతికినా రూపాయి నోటు కనిపించలేదు. పావలా దొరికింది. తను పేదవాడని తెలుస్తూనే ఉంది. కాని దానం





మీ పళ్ళు కావు,
చిగుళ్ల అనారోగ్యం.

మీ చిగుళ్లు ఆరోగ్యంగా లేకపోతే మీరు నోటి దుర్గంధంతో బాధపడవచ్చు. ఎందుకంటే బలహీనమైన చిగుళ్లు పళ్ల నుండి విడిపోయి చెడువాసన కల్గించే సూక్ష్మక్రిములు చేరడానికి అవకాశాన్నిస్తాయి. తర్వాత మీరు ఎంత ఘాటైన వాసన గల టూత్‌పేస్టు వాడినా ఏమాత్రం ఫలితం వుండదు.

అందుకే మరి, మీకు కావాలి, చిగుళ్లను కాపాడ్డంతోపాటు నోటికి తాజాదనం చేకూర్చే టూత్‌పేస్టు.

ఫోర్‌హెన్స్. ఇది పళ్ల డాక్టరుద్వారా ప్రత్యేకంగా తయారు చేయబడిన టూత్‌పేస్ట్. దీనిలోని విశిష్టమైన ఆస్ట్రింజెంట్ నిజంగా, చిగుళ్లను గట్టిపర్చి వాటిని దృఢంగా, ఆరోగ్యంగా వుంచుతుంది. సూక్ష్మక్రిములను అరికట్టి శ్వాసను శుభ్రంగా, తాజాగా వుంచుతుంది.

సుప్రసిద్ధ ఫోర్‌హెన్స్ రక్షణ అంటే ఇదే మరి! వాడి చూడండి, స్వయంగా ఆ వ్యత్యాసం కనుక్కోండి.

ఫోర్‌హెన్స్ — మీ చిగుళ్ల కోసం టూత్‌పేస్టు.

ఫోర్‌హెన్స్
సంరక్షణ
32 తీరులో వుండేలా

GM-37/87. Tel R

గ్రహించదు.

"ఒక్క క్షణం ఉండండి. కిందకుపోయి చిల్లర తెస్తాను."

ఆమె వెనకనే అతను మెట్లు దిగుతూ-"ఆ పావలా బిళ్ళ చాలు కదండీ. శ్రమ పడవద్దు" అంటూ చెయ్యి చాపాడు.

"అయితే ఉండండి. ఆటో ఛార్జీలన్నా తీసుకోరా ఏమిటి?" అంటూ వది నోటూ, పావలా బిళ్ళా అందించబోయింది.

"ఆటో అక్కర్లేదు. చాలా దగ్గిర" అని పావలా కాను చేతిలో తీసుకొని "వస్తానండీ" అంటూనే వినవినా నడిచిపోయాడు. మట్టీ అంటుకున్న పాత తడిపొడి ధోవతీ, అదే పాత నలిగిన లాల్చీ, వెలిసినదైనా నిండుతనం ఇస్తున్న భుజంమీది టవలూ. కాళ్ళకు చెప్పులైనా ఉన్నాయా? దానగ్రహీత లెందరినో చూసిన తను, ఈ అపరిగ్రహీతుడి వింతధోరణినీ, వినయసంపత్తినీ ఆశ్చర్యంగా ఆలోచిస్తూ, అసంతృప్తి



ఆవహిస్తుండగా గేటు దాకా వచ్చి-"ఏమండీ !" అని పిలిచి ఆగిపోయింది.

"నా కేమీ బాగోలేదు. ఏమీ తీసుకోలేదు. ఇదిగో ఈ పుస్తకమన్నా పుచ్చుకోండి. మా అమ్మగారి..."

నిస్సంకోచంగా గ్రంథా న్నందుకొని వెంటనే పుటలు తిప్పుతూ ఆగిపోయి, మొదటిసారిగా ఆమె ముఖాన్ని తిలకిస్తూ-"మా అమ్మ పేరు కూడా శాతదాంబే. మాతృ స్మృతి అంటే మాతృస్తవమే. ఆమె ధన్యురాలే. స్తోత్రం రాసినవారూ ధన్యులే" అంటూ పేజీలు తిరగేస్తూనే ఉన్నాడు. అతను కదలిపోవటం కూడా సుశీల గమనించలేదు. భోజనానికి ఆమె మఠంలోకి వెనుదిరిగిపోయింది.

** ** **

దాదాపు సంవత్సరం నుంచి శ్రీనివాస శర్మ వ్యాకుల పడుతూనే ఉన్నాడు. బొంబాయిలో ఉన్న మూడేళ్ళూ తల్లి తద్దినం పెట్టడానికి నానాయాతనలూ పడవలసి వచ్చింది. ఒక ఏడు మాత్రం నాసిక్ దగ్గర త్రయంబకేశ్వరం వెళ్ళి జరిపించగలిగాడు. రెండేళ్ళు అన్నదాన సమాజం వారికి కొంత డబ్బు కట్టి శ్రాద్ధకర్మ నిర్వర్తించా ననుకొన్న అర్థభాగం తృప్తితో మసిలాడు. నిరుడు హైదరాబాద్ బదిలీ కాగానే మాతృ యజ్ఞానికి ఆటంకాలు తొలగిపోయాయనుకుని వంటమనిషినీ, బ్రాహ్మణ్ణీ, భోక్తల్నీ ముందే కుదుర్చుకుని ఆఫీసులో తన తోటి వాళ్ళందర్నీ భోజనాలకు పిలిచాడు. తీరా పెద్దఎత్తున వంట పూర్తయి నిరీక్షిస్తూ, అపర్ణాహం కూడా గడుస్తున్నా బ్రాహ్మలు రాకపోయేసరికి చికాకు పడి, నరసింహాన్ని పంపించాడు. ఆరా తీయగా ఆ నలుగురు విప్రులూ అయిదు వందల రూపాయలకు ఆశపడి సైనిక్‌పురిలో ఒక మిలిటరీ ఆఫీసరు తండ్రి చావుకు తరలిపోయారని భోగట్టా దొరికింది. ఇక ఆ వంట బ్రాహ్మడే ఎవరో ఇద్దరు బ్రహ్మచారుల్తో తతంగం అయిందనిపించాడు. శర్మ ఖిన్నుడైపోయాడు. నిజానికి తన జీవితమంతా వ్యాకులమే కదా అనుకున్నాడు.

పుట్టింది పేదగా మారిన శిష్ట కుటుంబంలో. బాల్యంలోనే, తనకు జ్ఞానం స్ఫురించకముందే తండ్రి చావు. అష్టకష్టాలు పడి, ప్లీడర్ల ఇళ్ళలో వంటలు చేసి, తనకు వారాలు కుదుర్చిన అమ్మవల్ల తన చదువు ముందుకు సాగింది. కాలేజీనుంచి స్కాలరు షిప్పులు అంచెలంచెలుగా అయినా, నిరాఘాటంగా తన చదువు ఈడేరుతున్నది. కాని పూలమ్మిన ఊళ్ళోనే కట్టెలమ్ముతూ, కొవ్వొత్తిలా కరిగిపోతూ, తన కోసమే బతికిన తల్లి సంగతి తన చదువు మత్తులో మరిచిపోయాడేమో? నేడో రేపో తనకు ఉద్యోగప్రాప్తి అని తలపోస్తూండగా ఆమెకు అవసానకాలం. తను స్కాలర్‌షిప్పులో మిగిల్చి పంపిన మొదటి సంపాదన తల్లి దహన క్రియలకు మాత్రమే ఉపయోగపడింది. ఎవరికోసం ఈ చదువు, ఎవరి కోసం బ్రతుకిక? ఎవరి నుద్ధరించడానికి తన ఉద్యోగ ప్రయత్నం? మేనమామ ఎవరెవరినో అర్థించి తెచ్చిన అప్పుతో నిత్యకర్మ ప్రారంభించాడు. కులం పట్టింపులు, క్రియారూపక మతకర్మలు- వీటిలో ఏమీ విశేషం గోచరించని నమ్మకం, తన సంస్కారం, చదువు. కర్మ చేస్తున్నప్పుడు మొదటిసారిగా గరుడ పురాణం విన్నాడు. పితృదేవతలు పైశాచిక ప్రేతరూపం విసర్జించి చంద్రలోకం దాకా పయనించడానికి పదహారు మాసాల కాలం. మాసికాలు, ఏడూరు అనబడే సాంవత్సరీకం నిర్వర్తించేసరికి ఈ ప్రథమ ప్రయాణం ముగుస్తుంది. మన కాలమానం నెల పితృదేవతలకు అప్పటి వరకూ ఒక దినమే. నమ్మకం లేకుండానే విని, తన కింత ఉపశమనం ఎందుకు కలిగిందో విమర్శించుకున్నాడు. అమ్మ చివరి మాటలు తను వినలేకపోయినా, మేనమామ నోటినుంచి విని శ్రాద్ధకర్మలు క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నాడు. ప్రతి శిశువులోనూ ఎదగబోయే వృద్ధుడి రూపాన్ని చూసే నిస్పృహ ధోరణి నుంచి, మరణం పొందనున్న ప్రతి మానవ స్వరూపంలోనూ గుప్తమైన శాశ్వత స్థితి ఇమిడి ఉన్నదన్న బ్రహ్మజ్ఞానాన్ని గురించి తెలుసుకుని, తన తల్లి వంటి దైన్యుల కందరికీ ఒక శరణాలయం స్థాపించాలని ఎప్పుడో నిర్ణయించుకున్నాడు. అది లక్షలతోనే సాధ్యమయ్యే సంకల్పం. అందుకే తన ఆర్జనంతా వినియోగిస్తున్నాడు.

రాఘవేంద్రస్వామి మఠం అతనికి చాలా నచ్చింది. కన్నడ ఆంధ్ర సంప్రదాయాల్లో అభేదం, శిష్టులకు, ఆధునికులకు కూడా అనుకూల వాతావరణం. నరసింహం చెప్పిన మీదట అక్కడి ఏర్పాట్లు చూసి, తల్లి శ్రాద్ధానికి అనుకూల స్థితి ఉందని తృప్తి పడి, తిథి, వారం, తేది నిశ్చయం చేసుకోవడానికే ఆనాడు వచ్చింది. తల్లి ఎంత దీనురాలిగా ప్రపంచయాత్ర ముగించుకుందో గాని, అంత నిరాడంబరంగానే అతనక్కడకు వెళ్ళాడు. అది అలవాటు. సుశీల అప్పుడే అతన్ని నిలవేసింది.

*** *** ***

తీరా సుశీల ఇంటిని చేరిన తరువాత గాని తన వానిటీ బ్యాగ్‌లో ఒక కొత్త మనీపర్సు ఉన్నట్లు తెలుసుకోలేదు. ఎంతటి మతిమరుపు? తనదా? తను స్నానం చేయబోతూ చేతి కందించి, చివరకు తిరిగి తీసుకోకుండానే నిర్గమించిన ఆ పేద యువకుడిదా? అయ్యో ఎంత పొరపాటు జరిగింది- అని విస్తుబోయి, పదిసార్లు దాన్ని తెరిచి మూసింది సుశీల.

ఎస్.ఎస్. ఖణ్వన, పి.హెచ్‌డి. అన్న లేబిల్ మాత్రం టైప్ చేసిన అక్షరాలతో సగం మాసిపోయి కనబడుతున్నది. లోపల మూడు వంద రూపాయల నోట్లు, ఏడు పది రూపాయల నోట్లు, రూపాయి లోపు చిల్లర, కొత్తగా ఉన్న రెండు చిన్న తాళపు చెవులు. వాటిని చూడగానే మొదట స్కూటర్‌వేమోనన్న అనుమానం తగిలి పరీక్షగా పరిశీలించింది. అవును. అయితే అతను స్కూటరు మీద వచ్చి ఉంటాడా? లేక... లేక... దొంగ పర్సా? ఛీ, పాపం! మరి ఎట్లా వెళ్ళగలిగాడు? స్కూటర్‌ను లాక్ చేయకుండానే వచ్చి, అపి, తిరిగిపోయి ఉంటాడా? ఏ దృష్టినుంచి ఆలోచించినా పశ్చాత్తాపం చుట్టుముడుతూనే ఉంది.

మర్నాడు బ్యాంకులో తన కాబిన్‌లో కూచున్న తక్షణమే టెలిఫోన్ డైరెక్టరీ తీసి పేరు వెతికింది. ఎస్.ఎస్. ఖణ్వన లేదు. పోనీ, ఖణ్వన ఎస్.ఎస్. అదీ లేదు. ఎక్స్ఛేంజికి ఫోన్ చేసి ఎంక్వయిరీ చేసింది. ఊహూఁ! నిజంగా దొంగ పర్సేనేమో అని భయం పట్టుకున్నది. సబ్ మేనేజర్ పురుషోత్తం గారిని పిలిచి సలహా అడిగింది.


"ఇదేదో ఉత్తరాది పేరు?" అన్నా డాయన.

దాంతో సుశీల సందేహాలు పెచ్చుపెరిగాయి. గాని పరిష్కారం గోచరించక, సిటీ వార్తాపత్రికలో చిన్న ప్రకటన ఇద్దామనుకుని మళ్ళీ ఆయన సలహా అర్థించింది.

"కొరివితో తల గోక్కోవడం అవుతుంది. దొంగ పర్సే అయితే, వా డో పిక్‌పాకెట్ అయి ఉంటాడు గదా? వాడితో మీ పరిచయమేమిటి? ఎట్లా, ఎక్కడ, ఎందుకు ఇన్ని ప్రశ్న లొస్తాయి. లక్షా తొంభై. పోలీసుల్తో వ్యవహారం!

'దొంగ' అన్న పదం కర్ణకఠోరంగా ఉన్నది. అతని అమాయకమైన ముఖానికి గానీ, అతని తదుపరి ప్రవర్తనకు గానీ ఆ పదంతో పొంతన కుదరలేదు. చేసేది లేక దా న్నో కవర్లో వేసి సీలు చేయించింది. కాని మరిచిపోవడం సాధ్యమా? సాధ్యం కాకుండా చేసిన ఇంకో సంఘటన కూడా జరిగింది.

ఆ నెలలోనే సుశీలకు ప్రమోషన్ వచ్చింది. రీజినల్ ఆఫీసులో ఫారిన్ ఎక్స్ఛేంజి డిపార్టుమెంట్ హెడ్‌గా. ఆ హడావిడి పార్టీలు, తన కాగితాలన్నీ సర్దుకోవటాలు కొత్త బ్రాంచి మేనేజర్‌కు అప్పగించటాలు. స్త్రీ సహజమైన తన జాగ్రత్తను క్షణం మరిచిపోయిందేమో? సీల్డు కవరు



కిందపడి ఆ పర్సు విడిపోయి, అందులో ఏ మూల దాగి ఉందో ఒక చిన్న పాస్‌పోర్టు సైజు ఫోటో జారి వచ్చింది. ఒక మధ్యవయస్కురాలైన వితంతు స్త్రీది. ఆమెకు ఫోటోగ్రఫీ హాబీ. ఇంట్లో వంటగది పక్కన ఉన్న పాంట్రీ గదిని డార్క్ రూమ్‌గా మార్చి అక్కడే ఫోటోలు డెవలప్ చేయడం. అందులో ఎన్లార్జిమెంటంటే ఆమెకు మహాఇష్టం. ఇంటినిండా తల్లి ఫోటోల ఎన్లార్జ్‌మెంట్లు పది పన్నెండు దాకా ఉన్నాయి. ఈ ఫోటోను కూడా నాలుగైదు రోజుల్లో పెద్ద సైజుకు ఎన్లార్జ్ చేసి చూసింది. నలుపు తెలుపు ఫోటో. అక్కడక్కడ టచింగ్ చేస్తూ పరీక్షగా చూసింది. నిస్సందేహంగా ఆ బొమ్మలో ఆ రోజు తను చూసిన పేద యువకుడి పోలికలెన్నో ఉన్నాయి. ముఖ్యంగా ముక్కూ, కళ్ళూ, నుదురు. అతని తల్లి ఫోటోలా ఉంది. హమ్మయ్య? ఇది దొంగపర్సని పురుషోత్తం గారు రేకెత్తించిన అనుమానం పటాపంచలయిపోయింది. తన నవనాగరిక ఆలోచనలకు మళ్ళీ పశ్చాత్తపపడి వార్తా పత్రికలో ప్రకటన ఇవ్వాలనే నిశ్చయించుకుని ఫోన్ చెయ్యాలని డైరీలో గుర్తు రాసుకున్నది. కాని ఆ మరునటి రోజు, ఆ మరునాడు, ఆవలి ఎల్లుండి- పూర్తిగా తీరికలేని పని. పెద్ద బాధ్యత. రీజినల్ మేనేజర్ తరువాత పెద్ద పదవిగల సీటు. కొత్తగా అమర్చిన రెండు కంప్యూటర్లతో తను ఇప్పుడే అలవాటు పడుతున్నది. పెండింగ్‌లో ఉన్న యాభై, అరవై అప్లికేషన్లూ, తను చార్జి తీసుకోకముందే బ్రాంచి ఆఫీసులనుంచి వచ్చినవి- సగంపైనే డిస్పోజు చేసి తిరిగి వాపసు చేసినా, పెద్ద మొత్తాలవి మాత్రం అలాగే ఉన్నాయి. ఈ ఇంపోర్టు లైసెన్సులతో విదేశీ మారకం అప్లికేషన్లు ఒక్కోసారి పెద్ద తలనొప్పి. రిజర్వు బ్యాంకుతో, కంప్యూటర్లతో, క్లయింట్లతో, బ్రాంచి మేనేజర్ల ఒత్తిడితో వారానికి పది రూపాలతో పంపవలసిన ఒకే రిపోర్టు- వంటి వాటితో తన చదువుకు పూర్తిగా ఛాలెంజ్ అనిపించుకునే పదవికి తనెందుకు ఎదిగిపోవాలి మరి-అని కూడా ఒక్కో క్షణంలో అనుకునేది.

తెలుగు సినిమాల్లో కథా సరళత కోసం, దర్శకుడి ఆలోచన, భావుకత్వ లోపం వల్ల అనేక యాదృచ్ఛిక సంఘటనలు ఒకేకాలంలో జరిగిపోతూంటాయి. కర్మ సిద్ధాంతాన్ని నమ్మేవాళ్ళు ఇటువంటి లీలల్ని తమ అనుభవంగా పేర్కొంటుంటారు. ఆ మధ్యాహ్నం కాఫీ టైమ్‌లో ఒక విజిటింగ్ కార్డు సుశీల ముందించిన ఎకౌంట్స్ అసిస్టెంటు "రీజినల్ బాస్‌గారు వీరి ఫైల్‌ను చూడమంటున్నారు" అని ఆ కార్డు క్లయింట్‌ను ప్రవేశపెట్టి వెళ్ళిపోయాడు.

"ఖణ్యాన కంప్యూటర్ కన్సల్టెన్సీ సర్వీసెస్: డా. కె. శ్రీనివాస శర్మ ఎం.డి."

తెలిక రంగు ఉలెన్ సూటు. తెలిక తేనెరంగు చలవ కళ్ళజోడు. చేతిలో ఎగ్జిక్యూటివ్ బ్రీఫ్‌కేస్.

"ఎక్స్యూజ్ మీ "

అతనే? తన టేబిల్ మీది నేమ్ ప్లేట్ చూస్తూ నిలబడిపోయాడు- 'మిస్ ఎస్. సుశీల, ఎం.కాం., సి.ఏ., ఐ.ఐ.బి.'

కుర్చీ చూపకుండానే "మీరా?" అన్నది.

కళ్ళజోడు తీశాడు. ఆమె లేచి నుంచొని నమస్కారం చేసి, "గుర్తు పట్టారా?" అని ప్రశ్నించింది.

చేతి రుమాలుతో ముఖం తుడుచుకుని, "కొంచెం మారిపోయారు. గుర్తు పట్టాను. కూర్చోవచ్చా?" అని చిరునవ్వు నవ్వాడు.

"క్షమించాలి? నుంచొనే ఉన్నారు."

కూచుని బ్రీఫ్‌కేస్ తెరచి ఆమె పుస్తకం "మాతృస్మృతి" తీసి "మంచి కవిత్వాన్ని మరిచిపోయేవాళ్ళు మూర్ఖులు" అంటూ అందించాడు.

సుశీలకు అశ్రుజలం మసకలో పుస్తకంలో అతను అండర్‌లైన్ చేసిన పంక్తులూ, మార్జిన్‌లో రాసిన పెన్సిల్ అక్షరాలూ అస్పష్టంగా కనిపిస్తున్నాయి.

"నన్ను క్షమిస్తానంటే ఇంకో మాట చెబుతాను. మీ పర్సు నా దగ్గరే ఉంది. స్కూటరు తాళం చెవులు కూడా... చాలా అపోహ పడ్డాను" అని అన్నది.

"అట్లాగా? ఎక్కడో పోయాయనుకున్నాను. మా అమ్మ స్వప్నంలో కన్పించి పోలేదని చెప్పింది. మీ పద్యంలో ఒకచోట జార విడిచిన తాళపు గుత్తిని గురించిన ప్రస్తావన ఉంది." అని సౌమ్యమైన కృతజ్ఞతలు.

ఆమె కుతూహలంగా, ఆశ్చర్యంగా అతని వంక తేరిపార చూసి "ఎప్పుడొచ్చింది ఆ కల?" అని అడిగింది.

"పోయిన... అంటే కిందటి గురువారంనాడు."

సుశీల ఆ రోజునే అతని మాతృమూర్తిని ఎన్లార్జ్ చేసింది. "మీ అమ్మగారిని నేను చూశాను."

"మా అమ్మనా? ఎప్పుడు? ఎక్కడ?"

"మా ఇంటికి ఒకసారి రాగలరా?"

అతను నవ్వి, "మరి మా అప్లికేషను సంగతి అంతేనంటారా?" అన్నాడు.

"సారీ!" ఆమె కాబినెట్ తెరిచి వెతికి ఖణ్యాన కన్సల్టెన్సీ సర్వీసెస్ వారి పోర్టుఫోలియో తీసింది.

"ఒక్కమాటలో చెప్పమంటారా- మీ బ్యాంకు వారి అభ్యంతరాలను? కోల్లేటరల్ లేదని రాశారు. ఇరవై ఒకటో శతాబ్దానికి పదమంటున్నారు. కాని అంతా డబ్బుతో ముడిపెడితే ఆ ప్రయాణం సాగదు. మానవ మేధకు డబ్బు కన్నా ఎక్కువ విలువ ఉంది."

ఆమె కాయితాలు చదువుతూనే "అయిదు లక్షలా?" అని స్వగతంగానే పైకి అన్నది.

"అవును."

"డన్! మీ కొల్లేటరల్ నేను" అని సుశీల లేచింది.

బయట అతని కారు డ్రైవర్ ముందుకు వచ్చి బ్రీఫ్‌కేసు అందుకున్నాడు. తనే డ్రైవర్ సీట్లో కూర్చుని "డైరెక్షన్లు చెప్పండి" అని అన్నాడు.

సుశీల మేనత్త వేడిగా వడ్డించిన భోజనం తిన్నాడు. తల్లి ఫోటో తీసుకుని సెలవు తీసుకుంటూ "మా అమ్మ ఆత్మ ఈ చిత్రంలో ఉందనిపిస్తూన్నది. చాలా శ్రమ తీసుకున్నారు" అన్నాడు.

"మళ్ళీ పర్సు మరిచిపోయి పోతున్నారు."

అతను వెనక్కి వచ్చి "ఆ ఫోటోగ్రాఫర్‌కు ఇవ్వండి అందులో డబ్బు. ఫీస్ మాత్రం ఇచ్చేయండి" అంటూనే సాగిపోయాడు.

మళ్ళీ వస్తాడని సుశీలకు తెలుసు. మళ్ళీ టెలిఫోన్‌లో పిలుపు వస్తుందని అతనికీ తెలుసు. మాతృస్తవం తరువాత మాతృదర్శనం, తల్లులు దీవించిన ఏ బంధమైనా శాశ్వత బంధమేనని, మంగళప్రదమేనని వాళ్ళిద్దరికీ తెలుసు ★

నాణ్యత గురించి
ఆలోచించే వారికే

క్రౌంప్టన్ గ్రీవ్స్
టి.వి.లు
ఆథరైజ్డ్ డీలర్స్:
విజయ్ వీడియో హోమ్
14, రెవెన్యు కాంప్లెక్స్, లేపాక్షి షోరూం ప్రక్కన, జిన్నాటవర్
గుంటూరు-1 ఫోన్: 25357, (R) 31358
TARA-252